వ్యాస కౌముది



# రామాయణ కల్పవృక్షం
# విశ్వనాథ సీస పద్యశిల్పం-సౌందర్యం

-డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి

తెలుగు కవిత్వాన్ని జ్ఞానపీఠంపై అధివసింపచేసిన తొలి తెలుగు కవి, పద్మభూషణుడు, కళాప్రపూర్ణుడు కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ. 1895, సెప్టెంబరు 10 తేదీన వారి జననం తెలుగు భాషా సాహిత్య చరిత్రలో నూతనాధ్యాయానికి మహోదయం. సంప్రదాయవాదిగా, సనాతన ధర్మప్రబోధకునిగా, విద్యావేత్తగా, అనువాదకునిగా, నాటకకర్తగా, నవలాకారునిగా, కథకునిగా, మహావక్తగా ప్రసిద్ధికెక్కిన విశ్వనాథ సాహితీవిరాణ్మూర్తి. 'నిత్యమార్తాండ మూర్తిని నేనొకండ'' అని తనను గూర్చి తాను చెప్పుకొన్నట్లుగా విశ్వనాథ సాహిత్యం తెలుగు భాషాసంస్కృతుల తేజోరేఖలను నిరంతరం ప్రసరింప చేస్తుంది. 'తెలుగు జీవుని వేదన' ఆయన కృతులన్నింటా అడుగడుగునా సాక్షాత్కరిస్తుంది. ఆయన ఆహార్యం సంప్రదాయబద్ధం. అలోచన అభ్యుదయపథం. అభివ్యక్తి అనితరసాధ్యం. సాహితీ సృజన నిరంతర తపోనిష్ఠం.

శబ్ద ప్రయోగంలో విశ్వనాథ సర్వమార్గేచ్ఛావిధాత్రుడు. కొన్నిచోట్ల 'చికిలి మెఱుంగు సన్న నగిషీపనిబంగరు సేత,' కొన్నిచోట్ల 'అకలుషమౌవనాంతర మహా ఝరిణీ పరివేగమూ' కలగలసినది విశ్వనాథ పద్యం.

''నాది, వ్యవహారభాష మంథరము శైలి
తత్త్వము రసధ్వనులకు ప్రాధాన్యమిత్తు
రసముపుట్టింపగ వ్యవహారము నెఱుంగ
జనును లోకమ్మువీడి రసమ్ము లేదు.''

రామా. కల్ప. బాల. అవ. 37ప.

అని తన శైలీ విధానాన్ని ప్రకటించినారు. నిత్యవేగి అయిన తన చేతస్సుతో, శబ్దమేరుటకు చిన్నము నిల్వని భావ తీవ్రతతో, మధు ఝురీ భ్రమరీ ధ్వనితో విశ్వనాథ పద్య నిర్మాణ కళ శోభిల్లుతుంది.

తెలుగు సాహిత్యంలో నన్నయ నాటి నుండి సీస పద్యరచన వైవిధ్యసుందరంగా సాగుతుంది. మొదటి నాలుగు పాదాలు దేనికదే ప్రత్యేకమైన భావాలను ప్రకటించే రీతి ఒకశైలి. ఆ పాదంలో వర్ణింపబడిన భావం ఆ పాదంలోనే పూర్తయిపోతుంది. నాలుగుపాదాల తరువాత తేటగీతినికాని, ఆటవెలదినికాని అనుసంధానించటం సర్వ సాధారణ సంప్రదాయం. శ్రీనాథాది మహాకవులు ఈ రీతినే అవలంబించారు. నన్నయభట్టు దీనికి భిన్నమైన విధానాన్ని పాటించాడు. ఒకపాదంలో ప్రారంభింపబడిన భావం ఆపాదంతో పూర్తి కాదు. తరువాతి పాదంలోనికి కొనసాగుతుంది. పదాలు, సమాసాలు కూడ పాదం చివర పూర్తికాక అనంతర పాదంలోనికి చొచ్చుకొనిపోతాయి. ఈ విధమైన సీసపద్యాన్ని గునుగుసీసంగా విమర్శకులు విశ్లేషించారు. విశ్వనాథ ఈ రెండు విధానాలను అనుసరించారు. తన మంథరపు శైలితో, తత్త్వ రస ధ్వనులకు ప్రాధాన్యం కల్పిస్తూ సన్నివేశ ఔచిత్యాన్ని, పాత్రల తీరుతెన్నులను ప్రతిఫలింపచేస్తూ మనోజ్ఞమైన సీసపద్యశతాలను తెలుగు భాషాప్రేమికులకు చవులూరించినారు. రామాయణ కల్పవృక్ష కావ్యంలో 'తెలుగు మేల్ నుడికారమ్ములు దేశ్యముల్ పలుకు బళ్ళున్ జాతి మాట్లాడుకైవడి' హృదయావర్జితంగా విలసిల్లాయి. నన్నయభట్టారకునిది ఆఖ్యానశైలి. తిక్కన సోమయాజిది నాటకీయశైలి. శ్రీనాథునిది వర్ణనాత్మక శైలి. విశ్వనాథది స్వభావచిత్రణాత్మక శైలి.

దశరథుడు సంతానార్థియై తపించి తపించి సుమంత్రుని ఆదేశానుసారం అశ్వమేధయాగం, పుత్రకామేష్టిని నిర్వహించినాడు. దశరథుని రాణులు ముప్పురు గర్భాలు ధరించారు. దశరథుని ఆనందోత్సాహాలకు అవధి లేదు. ముప్పురు రాణుల భవనాలకు మాటిమాటికీ వెళ్తూ, వారి యోగక్షేమాలు పదే పదే విచారిస్తూ సంభ్రమాది మనోభావాలతో ఉన్న దశరథుని అంతరంగ స్థితిని విశ్వనాథ వర్ణించినాడు.

''వచ్చి తానంతలో వచ్చును మఱల భూ
నాథుండు కౌసల్య సౌధములకు
నిచ్చియల్లంతలో నొచ్చుగాన్కలు సుమి
త్రకు ధరిత్రీనాథు డొకండు
మెచ్చియామెచ్చులే మెచ్చియింకొకరీతి
మెచ్చు గైకేయి భూమి ధవుండు
వచ్చినవాడట్లె వచ్చినట్లుండు భూ
మీ నాయకుండు సుమిత్ర కడకు
నంతనంతట రాజకార్యములు చూచు
చుండి యుండియు యట్టులే యుఱకలేచి
ముగురు భార్యల నవ సౌధముల గడపల
దాఁక, బోయి లోనికి బోక తాకి తిరుగు''

– బాల అవతారఖండం. 155ప.

దశరథునికి తన సంతానాన్ని తాను ఎప్పుడు చూడగలనో అనే ఆతురత హృదయం అంతా వ్యాపించి ఉన్నది. ఒక్కొక్కరాణి సౌధానికి మరల మరల వస్తున్నాడు. వచ్చిన చోటుకే తిరిగి వస్తున్నాడు. మెచ్చిన మెచ్చులనే మరల మరల పలుకుతున్నాడు. కానుకలు ఇచ్చి అంతలోనే వేరొక కానుక ఇస్తున్నాడు. ఈ చిత్త విభ్రమం, సంభ్రమం ఈ సీస పద్యంలో తాండవించింది. 'ఇచ్చి'– అసమాపక క్రియా పదంతో ప్రారంభం– పిదప సమాపక క్రియాపదప్రయోగం. 'ఇచ్చు, మెచ్చు, వచ్చు' – అచ్చతెలుగు క్రియాపదాలతో పద్యం చమత్కారబంధురంగా నడిచింది. అంతరంగంలోని వివిధ భావాల సమ్మేళనాన్ని వర్ణించిన సందర్భాలలో తిక్కన అసమాపక క్రియలను మాలికగా గుచ్చి సీసపద్యాలుగా అల్లిన శైలి భారతంలో కనిపిస్తుంది. తిక్కన తెనుగు నుడికారపు పోకడ విశ్వనాథ పద్యంలో అందగించింది. దశరథుని భూనాథుడని ప్రతిపాదంలోనూ పేర్కొంటూ ఎత్తు గీతిలో ఆతడి రాజ కార్య ప్రస్తావన కావించటం రాచకార్యాలపట్ల విముఖుడు కాలేదనే స్ఫృహను కలిగిస్తుంది.

రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు అసాధారణ పరాక్రమ శాలురుగా ఎదుగుతున్నవేళ వారి బాల్యాన్ని, రాచనడకల చివురులను వర్ణిస్తూ బాల రాఘవుని మన కళ్ళముందు నిలిపిన తీరు చూడండి. శ్రీనాథ, పోతనల బాణి ఈ సీసంలో వాసి కెక్కింది.

"తన తల్లి కందుబాటునుమీఱి మేయసా
హసము జూపెడు బాలహంసవోలె
స్తన్యపానమువీడి చనువేళ నొంటి స
ల్లకి తోట జనెడు బాల కరివోలె
వేటనేర్పెడు తల్లి బాటదొలంగి తా
నై దూకు బాల సింహంబు వోలె
పుష్కలా వర్తకంబుల డ్రెంచికొని మెట్ట
పొలము లేగెడు చిన్ని మొగిలు వోలె
రామచంద్రుండు నడువగా రాఘవేశ
గృహములం బ్రతిబింబితా కృతుల బొలచె
బసికకుత్థ్సమాంధా తృల పసి దిలీప
రఘులఠీవులు చివురులౌ రాచనడలు."

(అవతారఖండం. 347ప)

రామచంద్రుడు దినదిన ప్రవర్ధమానుడవుతున్నాడు. క్రమంగా తల్లి ఒడి నుండి, చూపులనుండి, రక్షణనుండి విడివడి స్వేచ్ఛగా సంచరించాలన్న బాల్యలక్షణం ఆ బాల వీరునితో ప్రస్ఫుటం కాసాగింది. రూపంలో సౌందర్యం, సాహసం, వంశ పారంపర్యంగా సంక్రమించిన శౌర్య చిహ్నాలను వర్ణించటం కవి ఆంతర్యం. హంస యుక్తాయుక్త వివేచనకు, బాలకరి స్వేచ్ఛకు, బాలసింహం శౌర్యానికి, చిన్ని మొగిలు జన జీవన భద్రతకు ప్రతీకలు. ముగింపులో కకుత్థ్స, మాంధాతృల, దిలీప రఘువుల పసితనాన్ని స్మరింప చేయటం కొసమెరుపు. సూర్యవంశ రాజుల వీరలక్షణాలను పుణికి పుచ్చుకున్నవాడు శ్రీరాముడు అనే స్ఫూర్తిని కలిగించిన వర్ణన.

విశ్వనాథ కవిత్వ సృజనలో శిల్ప సౌందర్యాలు జతకట్టి సాహితీప్రియుల మానసాలను మానస సరోవరంతో విహరింప చేసిన సన్నివేశం అహల్యా శాపవిమోచనం. ఈ వృత్తాంతాన్ని విశ్వనాథ నిర్వహించిన తీరు నిరుపమానం. వాల్మీకి నుండి కథను, ఆధ్యాత్మం నుండి తాత్త్వికతను స్వీకరించి, శిల్ప సమన్వితమైన తమ రచనలో జీవుని వేదనను రంగరించి తీర్చిదిద్దారు విశ్వనాథ.

రాయపాదం, సోకి అహల్యకు చైతన్యం కలగటం విశ్వనాథ దృష్టిలో ఒక ఆకస్మిక సంఘటనకాదు. అది ఒక క్రమపరిణామశీలమైన అద్భుత సన్నివేశం. అల్లంత దూరాన రామచంద్రుడు ఆశ్రమ ప్రాంతంలో కాలుమోపాడో, లేదో ఆమెలో ఒక్కొక్క ఇంద్రియానికి సంబంధించిన జీవ చైతన్యం మేల్కొన సాగింది.

''ప్రభుమేనిపై గాలి పై వచ్చినంతోనే
పాషాణ మొకటికి స్పర్శవచ్చె
ప్రభుకాలి సవ్వడి ప్రాంతమైనంతనే
శిలకొక్కదానికి చెవులు కలిగె
ప్రభుమేని నెత్తావి పరిమళించిన తోన
యశ్మంబు ఘ్రాణేంద్రియమ్ముఁజెందె
ప్రభు నీలరత్న తోరణ మంజులాంగంబు
గనవచ్చి రాతికి కనులు కలిగె
ఆప్రభుండు వచ్చి యాతిథ్యమును స్వీక
రించినంత నుపలహృదయ వీధి
నుపనిషద్వితాన మొలికి శ్రీరామ భ
ద్రాభిరామ మూర్తియగుచుఁ దోచె'

– బాల. అహల్యాఖండం.554

ఈ పద్యంలో సృష్టికి, వ్యష్టికి కల అనుబంధాన్ని తార్కికమైన రీతితో చిత్రించారు విశ్వనాథ. ఈ ప్రపంచం పంచభూతాల సమ్మేళనం. పంచతన్మాత్రలైన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు జీవరాశుల్లో ప్రవేశించి, మానవులలో పంచజ్ఞానేంద్రియాలుగా ఏర్పడతాయి. శాపవశాన రాయిలా పడి ఉన్న ఆహల్యకు జ్ఞానేంద్రియాలు క్రమంగా చైతన్యవంతం కావటం ప్రారంభమై పరిపూర్ణ స్త్రీ రూపాన్ని సంతరించుకున్నాయి. పంచభూతాలతో వాయువు స్పర్శలక్షణం కలిగినది కనుక ప్రభుమేనిగాలి సోకినంతనే స్పర్శ వచ్చినది. శబ్దం శ్రవణేంద్రియ సంబంధి కనుక ప్రభుకాలి సవ్వడి దరిచేరగానే చెవులు ఏర్పడినాయి. పరిమళం నాసికా సంబంధమైనది కనుక ప్రభుమేని నెత్తావి సోకినంతనే ఘ్రాణేంద్రియం చేతన నందినది. దర్శనం (రూపం) నేత్ర సంబంధమైనది కనుక ప్రభువు మంజుల గాత్రం కానవచ్చినంతనే కన్నులు కలిగాయి. ప్రభువు ఆతిథ్యం స్వీకరించినంతనే హృదయంలో ప్రభువు తత్త్వమేరసమై తోచింది. ఇది విశ్వనాథ కవిత్వకళ. సీసపద్యరచనా విన్యాసం.

'విశ్వనాథ కవితాత్మనుండి సీసం ఒక నిర్దిష్టలక్ష్యంతో రసికజన మనోభిరామమై వెలువడుతుంది. రామ లక్ష్మణులు విశ్వామిత్రునియాగ సంరక్షణానంతరం ఆ రాణ్ముని వెంట మిథిల ప్రవేశించారు. సీతాస్వయంవర సభలో ఆసీనులైనారు. మహర్షి

కనుసన్నతో శ్రీరాముడు ధనుర్భంగ కృత్యానికి ఉద్యుక్తుడై ఒక్కసారి తత్సభాభవన నివిష్ట ప్రాగ్దిశా సౌధంపై అంతస్తున అంతఃపుర స్త్రీల కదలిక గుర్తు పట్టి యాదృచ్ఛికంగా తలఎత్తి చూసినాడు. తొలిసారిగా జానకిని వీక్షించినాడు. వారిరువురి అనిర్వచనీయమైన అనుబంధాన్ని అభివర్ణించటానికి సీసపద్యం ఎత్తుకున్నారు విశ్వనాథ.

''ఇదమిత్థమని నిర్ణయింపగా రానిదే
కోర్కియో రూపుగైకొన్నయట్లు
జన్మ జన్మాంతర సంగతమ్మైన యా
శాబలం బవధికి సాగినట్లు
ప్రాణముల్ బయటికివచ్చి ముగ్ధాకార
మెనయించి దర్శనమిచ్చినట్లు
తన సృష్టిలోని యుత్తమ భావ మానంద
ముగ బొంగి బింబమై పొడిచినట్టు
లలయరుంధతియును నహల్యయును గోస
లాత్మజాతయు ముప్వురి యాననముల
కన్నను బవిత్రమగుచు శృంగార భావ
మొడిసి పట్టిన ముఖచంద్రు డొకడు తోచె''

– బాల. ధనుష్ఖండం. 299.

సీతారాములది ఆత్మబంధం. సాక్షాత్తు విష్ణు అవతారం రామచంద్రుడు. లక్ష్మీ అంశోద్భవ సీతాసాధ్వి. సీత శ్రీరామచంద్రుని చిత్తపదం. రాముడు జానకీ ప్రాణపదం. అతిలోకమైన వారి అనుబంధాన్ని ఉదాత్తరమ్యంగా ఈ సీసపద్యంలో ఆవిష్కరించారు విశ్వనాథ. స్త్రీమూర్తిలో మాతృదేవతను దర్శించటం భారతీయ సంస్కృతివిశేషం. అరుంధతి, అహల్య సాధ్వీమణుల పవిత్రత, తల్లి కౌసల్య వదనంలోని పవిత్రత, సీతాదేవి ముఖంలో పొడసూపింది. అయితే జానకి ధర్మపత్ని కానున్నది కనుక పవిత్రతతో పాటు శృంగార భావం ఒడిసి పట్టిన ముఖచంద్రుడు అన్నారు విశ్వనాథ.. పద్యం అంతటా ప్రసరించిన భావ సౌకుమార్యానికి ఏడునిలువుల ఎత్తు పవిత్రతను అద్దిన ముగింపు ఈ పద్యంలో గుబాళించింది.

పాత్రలస్వభావానికి, అంతరంగ చిత్రణకు, కథా గమనంతో ఆయా, పాత్రల స్వభావానికి అద్దం పట్టే పదబంధాలతో, భావనైశిత్యంతో రచన సాగించటం విశ్వనాథ పద్యకళ. కామరూపిణి అయిన శూర్పణఖ సింగారించుకొని రాముని చెంతకు చేరింది. ఆమె సౌందర్యంలో సంప్రదాయత, పవిత్రత లేదు. రాక్ష సోచితమైన ఒకానొక వికృతి దాగి ఉన్నది. అది అంతర సంబంధి. ఆ వికృతిని, వ్యతిరేకతను (Negitive attitude) బట్టబయలు చేస్తూ విశ్వనాథ శూర్పణఖను ప్రవేశపెట్టారు.

''విరిసి మన్మథరాజు బిట్టావులించిన
యాకాశమది రూపమందెననగ

విరియమ్ముకవాని విల్ ఫెళ్ళున విరిగిన

పెనురావమది మూర్తి తనరె ననగ

శివదృగగ్ని నిపేత నవమన్మథ శరీర

శిఖయిట్టి యాకృతి చెందెననగ

మన్మథ దహనసంభవ రతీ బాష్ప సం

తానమీ దేహంబు పూనెననగ

------

ఒకానొక కామిని కానుపించె''

– (అరణ్య. పంచవటి ఖండం)

మన్మథుడు సౌందర్యానికి ప్రతీక. మన్మథుడు ఆవులించగా ఆకాశమే ఆమె రూపంగా ఏర్పడింది. ఆవులింత వికారానికి, అలసత్వానికి సంకేతం. ఆమెరూపంతో శబ్దగుణం ఉన్నది. అది శ్రావ్యమైనది కాదు. పుష్పబాణుడైన మన్మథుని విల్లు శుభంకరమే కాని ఫెళ్ళున విరగటం అశుభ సూచకం. శూర్పణఖలో తేజస్సు ఉన్నది. అది శివుని కంటిమంటకు భస్మమైన మదన శరీరశిఖ విధ్వంస సంకేతం. ఆమెలో జలాంశ ఉన్నది. అది భర్తను కోల్పోయిన రతిదేవి బాష్ప సమూహం. జలం ప్రాణాధారం. బాష్పజలం దుఃఖ భరితం. పైకి కనిపించే శూర్పణఖ సౌందర్యం మాటున ఆమె కృత్రిమత్వము, అశుభత్వమూ, దురాలోచనమూ ఈపద్యంలో ప్రతిఫలించాయి. భావి కథార్థ సూచనతో, పాత్రల అంతరంగాలను దర్శింపజేసిన వర్ణనాత్మకశైలి విశ్వనాథ రసధ్వని.

ఋతువర్ణనలలో ప్రధానంగా సూర్యతాపం మిక్కుటంగా వ్యాపించే గ్రీష్మర్తు వర్ణనలో అలంకారికమైన ప్రబంధ శైలిలో. గౌడీ రీతిలో సీసపద్యాలను పరుగెత్తించిన వైఖరి విశ్వనాథ కల్పవృక్షంలోని ప్రత్యేకత.

''ముకుళీభవద్రక్త మోహనాంభో జాత–

పత్రాగ్ర కాంతి సంబంధకములు (బాల. ధనుష్. 276)

వంటి పద్య నిర్మాణ ప్రతిభ విశ్వనాథది. కొన్ని సందర్భాలలో సాధారణ జనుల సంభాషణను, ప్రవర్తనను వివరించే పట్టులలో సామాన్య వచనశైలిలో సీసం నడుస్తుంది.

శ్రీరామచంద్రుని అద్వితీయ లావణ్యానికి ముగ్ధులైన జనులు నిరంతర రామనామ స్మరణలో మునకలు వేస్తున్నారు. ఎవరితో ఏ విధమైన సంభాషణ కావించినా, ఏ ఇతర కార్యకలాపాలలో నిమగ్నులైనా వారి నోటివెంట రామనామమే వెలువడుతున్నది.

''ఆచిత్రమేమిటో? యాపురంబునయందు

బ్రజలెల్ల ప్రశ్నోత్తరంబులందు

బ్రశ్నయడుగ బోయి రామచంద్రుండంద్రు

బదులు చెప్పగ రామభద్రుండందురు''

– బాల. అవతార. 281

లోకంలో ఒక వ్యక్తిపై గుండెనిండుగా ఏర్పరచుకున్న ప్రేమాభిమానాలున్న వ్యక్తులు వర్తించే అతి సహజమైన భావనా రమ్యత, పద్యంలో ఒదిగిపోయిన తీరు అనిర్వచనీయం.

కథాగమనంలో ఒక పాత్ర ప్రవేశానికో లేక ఒక దృశ్య పరిచయానికో, లేక ఆగామి సంఘటనకో సూచకంగా విశ్వనాథ వర్ణన చేస్తారు. సాధారణంగా సీసమే ఆక్కడ ఇమిడిపోతుంది. హనుమంతుడు లంకా నగరంలో సీత జాడ కోసం మహాహర్మ్య సముదాయాలన్నింటిని గాలిస్తూ ముందుకు కదులుతున్నాడు. కుంభకర్ణుని సౌధం దృశ్యమానం అయింది. అది కుంభకర్ణ నివాసంగా కవి వాచ్యం చేయరు. అక్కడి దృశ్యాల వలన పాఠకుని హృదయంతో కుంభకర్ణ స్పృహను కలిగిస్తారు.

''ఒక మహాసిత భుజంగకము చుట్ట

లు చుట్టలుగను నిర్మోకంబు తిగిచినట్లు

––––––

నిద్రామహాదేవి నీలనీరంధ్ర ని

ష్కుటముగా నిర్మించు కొన్నయట్లు''

(సుందర. పూర్వరాత్రఖండం. 211)

తామసగుణభరితుడైన కుంభకర్ణుడి నివాసం ఎలా ఉంటుంది? ఈ పద్యంలో కవి చూపిన ఉపమాన దృశ్యాలవలెనే ఉంటుంది. విశ్వనాథ ఊహా చమత్కారం ఇది. కవిసమ్రాట్ కమనీయ వర్ణనావైచిత్రి ఇది.

హనుమంతుడు క్రమక్రమంగా అశోకవనం ప్రవేశించినాడు. అది 'పంట తిరిగిన వరి పైరు పగిది' కానవచ్చినదని విశ్వనాథ పరిచయం. ఆ వనంలో ప్రవేశించగానే హనుమ హృదయం అవ్యక్తానం దానుభూతి నందినది. సాధారణంగా మానవునికి తాను సాగించిన నిరంతర కృషి ఫలించబోతున్న తరుణంలో ఆత్మవిశ్వాసం ద్విగుణీ కృతమవుతుంది. హృదయం అనిర్వచనీయాను భూతినందుతుంది. అదే 'సిక్త్స్ సెన్స్' గా మనం వ్యవహరిస్తాం. హనుమంతుడు అశోకవనిలో అడుగు మోపగానే తన ప్రయత్నం ఫలించబోతున్నదని భావించాడు. తన జన్మ సహజమైన కోతి చేష్టలు చేసినాడు. ఆ చేష్టలు విశ్వనాథ సృజనతో పద్యమై పరిఢవిల్లింది. వానరం చపల స్వభావంతో చెట్లపై ఒకకొమ్మ నుండి మరోకొమ్మకు దూకుతూ ప్రదర్శించే 'చిత్రచిత్ర లంఘన విధాశ్రీ'లను చిత్రమైన శైలీవిన్యాసంతో దృశ్యీకరించారు కవి.

(సుందర. పరరాత్రఖండం. 33ప.)

అశోకవనంలో విన్యాసాలు చేసి చిట్టచివరకు శింశుపా వృక్షం అధిరోహించి రాఘవుల ఇంటి కోడలిని కాంచి ఆమెమే సీత అని నిర్ధారించుకున్న ఒడుపును చూడండి.

''ఉండనౌననియేమి యుండనేయున్నది

పద్మాక్షి సీత కావలయునీమె

ప్రౌఢదంష్ట్రా కాళరాత్రులౌ రాక్షసీ

గణము కత్తులు పూని కాయుచుండ

పద్మాక్షి సీత కావలయు నీయమ బాష్ప
ధారిఝరీ భూమి ధర దృశాంత
పద్మాక్షి సీత కావలయునీయమ యేక
వస్త్ర మాలిన్య సంభారమూర్తి ''

– సుందర. పరరాత్ర. 47ప

అంతవరకు సీతమ్మను చూడలేదు హనును. ఆసాధ్విని గుర్తించటానికి హనుమంతుడి హృదయంలోని హేతువులను చర్చకు పెట్టారు విశ్వనాథ. సీతాదేవి దైన్యరూపమూ, చుట్టూ రాక్షస స్త్రీలు కత్తులు పూని కాపుకాస్తున్న వైనం, కృశ దేహ అయిన ఆమె ఆకృతిని పరిశీలించి ఎంత తార్కికంగా హనుమ తన నిర్ణయాన్ని రూఢి పరచకున్నాడో వర్ణించిన ఈ పద్యంలోని తార్కికతకు, నిర్మాణ రీతికి ముగ్ధులు కాక తప్పదు.

ఆమే కాబోలు –మొదటిదశ – ఆమెయే– రెండవదశ– నిర్ణయానికి సముచితమైన ఉపపత్తులు– మూడవదశ. విశ్వనాథ పద్య నిర్మాణ కళ తారాస్థాయికి చేరిన రీతి.

రామాయణ కావ్యానికి శిఖరసదృశమైనది సుందరకాండ. సుందరకాండలో విశ్వనాథ రచనా నైపుణి మేరునగ సదృశమే. రామాయణ కల్పవృక్షం వాల్మీకి రామాయణానికి అనువాదం కాదు. విశ్వనాథ తనదైన ముద్రతో చేసిన వ్యాఖ్యాన రూపం.

''కవిప్రతిభతోననుండును కావ్యగత శ
తాంశములయందు దొంబదియైన పాళ్ళు
ప్రాగ్విపశ్చిన్మతంబున రసము వేయి
రెట్లు గొప్పది నవకథా దృతిని మించి'

– బాల. అవతారిక. 5ప.

అని ప్రారంభంలో పేర్కొన్నట్లుగా విశ్వనాథ ప్రతిభ బహుముఖీనంగా ప్రకటితమైన కల్పవృక్షం రామాయణ కల్పవృక్షం. సీస పద్యరచనలో విశ్వనాథ చూపిన వివిధ కళాత్మక రీతులకు మచ్చునకు ఇది కొన్ని మాత్రమే. ప్రతిష్టాత్మకమైన జ్ఞానపీఠ పురస్కారాన్ని చేజిక్కించుకున్న కల్పవృక్షంలోని కావ్యకళను అందుకోవటం తెలుగువారిగా మనం వారికి అందించే నివాళి.

★★★

COMMENTS